ఎలకొ్కట్టుడుతో జరభద్రం!

- మూషికాలతో వరి పంటకు తీవ్ర నష్టం
- రైతులకు అరకొరగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- మరోవైపు తెగుళ్లతో ఆందోళన


కొల్లిపర మండలం తూములూరులో చిరుపొట్ట దశలో ఉన్న వరి

కొల్లిపర: ఎలుక అనే జీవి చిన్నదే...కానీ వరి సాగులో రైతన్నలకు తెచ్చే నష్టం మాత్రం పెద్దది. ప్రస్తుతం వరి పంట పిలక దశలో ఉండడంతో మూషికాల దాడి అధికమైంది. కాసేపు విపరీత మైన వర్షాలు, మరోవైపు అగ్గి సెగలు ఉండడంతో వరి పంటకు దోమతెగులు ఆశిస్తున్నాయి. ఇంకో పక్క మూషికాల బెడద కలవరపాటుకు గురి చేస్తోంది. సాగులో అన్నదాతకు ఎలుకలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రారంభ దశలోనే ఇలా ఉంటే పంట చేతి కొచ్చే సమయానికి మరింత నష్టాన్ని చేకూర్చుతాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. అవి తినే దాని కంటే 8 నుండి 9 రెట్ల ధాన్యాన్ని అధికంగా పాడు చేస్తాయి. ప్రధానంగా ఖరీఫ్ సమయంలో ఎలుకలు ఎక్కువగా వరి పొలాల్లో గట్లపై స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయి.

ఎకరాకు 4–5 బస్తాలు నష్టం..

ప్రస్తుతం వరి పంట చేలు పొట్టపోసుకుని అక్కడక్కడ ఈనిక దశలో ఉన్నాయి. దీంతో పచ్చని చేలపై మూషికాలు దాడికి పాల్పడుతున్నాయి. రైతులు వీటిని ఎదుర్కొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడటంతో పాటు పంట దిగుబడిని కోల్పోతున్నారు. కొల్లిపర మండలంలో 20 గ్రామాల పరిధిలో సుమారు 5740 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం అరకొరగా పంపిణీ చేయడంతో రైతులపై మరింత సాగు భారం పడుతోంది. కొల్లిపర మండలానికి 20గ్రామాల్లో 5740 ఎకరాలకు గాను 62కేజీల బ్రోమోడయోలిన్ మందు వచ్చినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. రైతులు మాత్రం రైతు సేవా కేంద్రాలు ద్వారా అరకొరగా మందు పంపిణీ చేస్తున్నారు అని వాపోతున్నారు. మండలంలోని వల్లభాపురం,మున్నంగి, కొల్లిపర, తూములూరు, చక్రాయపాలెం, దావులూరు గ్రామాల్లో వరిపంటపై ఎలుకల దాడి ఎక్కువగా ఉంది. దీంతో ఎకరాకు సుమారు 4నుంచి 5బస్తాల వరకు దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక చర్యలతోనే ఫలితం

మందును ప్రయోగించే ముందు రోజు చేలగట్లపై ఎలుక బొరియలను మూసివేయాలి. మరుసటి రోజు ఏ బొరియలు తెరుచుకుని ఉంటాయో గమనించి అక్కడ ఎలుక ఉందని నిర్ధారణకు వచ్చి అక్కడ వరి నూకలు, నూనెలో కలబోసిన బ్రోమోడయోలిన్ మందును చిన్న చిన్న పొట్లాల రూపంలో ఉంచాలి. ఎకరాకు 5గ్రాముల బ్రోమోడయోలిన్ మందులో 96 గ్రాముల వరినూక, 4గ్రాముల నూనెతో కలగలిపి ఎర మందు తయారు చేయాలి. ముందు రోజు బొరియలను మూసివేయడం వల్ల ఆహారం దొరక్క ఎలుకలు ఖచ్చితంగా వీటిని తింటాయి. దీంతో ఎలుకలను నిర్మూలించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సామూహిక చర్యలతో కట్టడి



వరి పంట చిరుపొట్ట దశలో ఉన్న సమయంలో ఎలుకల దాడి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రైతులకు ప్రభుత్వం బ్రోమోడయోలిన్ మందును ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో అందిస్తోంది. ఇప్పటికే మందు వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. ఎలుకల దాడి వలన రైతుకు దిగుబడిలో ఎకరాకు కనీసం 4 బస్తాలు తగ్గుతున్నాయి. రైతులు సామూహికంగా ముందుకు వచ్చి ఎలుకలను నిర్మూలించుకోవాలి.

– ఎస్.శ్రీనివాసరెడ్డి, కొల్లిపర ఏఓ

క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కేఎస్‌కే విద్యాసంస్థల సీఈవో డాక్టర్ కత్తెర డేవిడ్ యశ్వంత్ జన్మదినం పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డేవిడ్ యశ్వంత్ మామ ఉన్నం యెహెజ్కేల్ మాట్లాడుతూ హార్వెస్ట్ ఇండియా సంస్థను డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినాలు ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉన్నం షకీలా, లంకా కిషోర్, సమితి నిర్వాహకులు కుర్రా శ్రీను, సతీష్, నాగేంద్ర, రవి, రజని, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని అందరూ ఖండించాలి



తెనాలిఅర్బన్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని అందరు ఖండించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేత దారా రామకృష్ణ పేర్కొన్నారు. సీజేఐపై జరిగిన దాడిని నిరశిస్తూ ఆ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ముత్తింశెట్టి పాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురేష్, కురగంటి మురళీ, పి.క్రాంతి, శ్యామ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీపై అవగాహన ముఖ్యం

తెనాలిఅర్బన్: జీఎస్టీలో వచ్చిన నూతన విధానాలపై అందరూ అవగాహన కలిగిఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెంచుపేట బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో బుధవారం జీఎస్టీపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. వ్యాపారానికి సంబంధించిన జీఎస్టీల లావాదేవీలు, ఆడిట్‌ల వివరాలను సేల్స్ ట్యాక్స్ అధికారి డి.నవీన్ తెలియజేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజ్‌లీ, వాణిజ్య శాఖాధిపతి డాక్టర్ సాంబశివుడు, అధ్యాపకులు డాక్టర్ సుధాకరయ్య, ఎం.వనజ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి విరిగిన విద్యుత్ స్తంభం

సత్వరమే స్పందించి సరిచేయించిన కమిషనర్



తెనాలి అర్బన్: ఒక్కసారిగా వాతావరణంలో మార్పుల వలన బుధవారం రాత్రి తెనాలిలో భారీగాలులతో కూడిన వాన పడడంతో సుల్తానాబాద్ వద్ద డివైడర్ మధ్యలో ఒక విద్యుత్ స్తంభం విరిగి అడ్డంగా హై టెన్షన్ విద్యుత్ వైర్ల పై ఒరిగిపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న మున్సిపల్ కమిషనర్ రామ అప్పల నాయుడు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించి, విద్యుత్ నిలిపివేసి విద్యుత్ సిబ్బందితో విరిగిపోయిన స్తంభాన్ని సరిచేయించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరింపజేశారు.

జీతం ఇవ్వకపోతే జీవనం ఎలా?

దుగ్గిరాల: ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్న నలుకుర్తి కోటేశ్వర రావుకి జీతం ఇవ్వకుండా యాజమాన్యం వేధిస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రలోని దుగ్గిరాల పోలీసు స్టేషన్‌లో కోటేశ్వర రావుతో కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగ దళిత సామాజిక వర్గానికి చెందిన కోటేశ్వర రావు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ బ్రాంచిలో అసిస్టెంట్ పని చేస్తున్నారని వారికి యాజమాన్యం ఇవ్వాల్సిన వేతనం క్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయటం దారుణమన్నారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కక్షపూరితంగా ఐదు నెలలకు ఒకసారి జీతం ఇస్తే కుటుంబం పోషణ కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏటుకూరి విజయ్ మాదిగ, సుదాకర్ మాదిగ, జిల్లా నాయకులు కొమరాల శ్రీనివాస రావు మాదిగ పాల్గొన్నారు.

తెనాలిలో కుండపోత


చినరావూరులో రోడ్డుపై వర్షం నీరు


బోసురోడ్డులో వాహనదారుల అవస్థలు

- గంటకు పైగా కురిసిన భారీ వర్షం
- జలమయమైన రోడ్లు

తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండగా.. సాయంత్రం 4గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అనంతరం ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. సుమారు గంటకుపైగా వర్షం కురవటంతో బోసు రోడ్డు, షరాఫ్ బజార్, గాంధీచౌక్, శివాజీచౌక్ ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. అలాగే శివారు ప్రాంతాలలో కూడా నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇదిఇలా ఉంటే మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం కావటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అర్ధ గంటకుపైగా పట్టణంలో అంధకారం నెలకొంది.

ఏపీ దేశీయ వైద్య సంఘంతో ఆయుర్వేద వైద్యానికి ప్రోత్సాహం


సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న పాంగురంగ విఠల్

తెనాలి: దేశీయ వైద్యసంఘంతో ఆయుర్వేద దేశీయ సాంప్రదాయాన్ని మరింతగా ప్రజలకు చేరువచేసేందుకు రాష్ట్రంలో ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని విశ్రాంత అదనపు ఎస్పీ పాండురంగ విఠల్ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని ధన్వంతరి వైద్యశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్యసంఘం సభ్యత్వ నమోదును నిర్వహించారు. తెనాలి ప్రాంతీయ కన్వీనర్ డాక్టర్ జూటూరు సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామాల శ్రీనివాసరావు మాట్లాడారు. పలువురు గ్రామీణ వైద్యులు సంఘ సభ్యత్వాలను పొందారు. గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తికొండ హనుమంతరావు, కార్యదర్శి కొలిపాక అంజిబాబు, ప్రభాకర్ రెడ్డి, టి.శ్రీనివాస రావు, డాక్టర్ విష్ణు రాధాకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి క్షేత్రాలను ప్రశంసించిన బ్రెజిల్ బృందం

జిల్లాలో ముగిసిన పర్యటన


వరి పంటలో జీవామృతం ఉపయోగించిన విధానాన్ని పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు బ్రెజిల్, శ్రీలంక, యూఏఈ దేశాలకు చెందిన సుమారు 30 మందితో కూడిన బృందం ఈనెల 2వ తేదీ నుంచి బుధవారం వరకు ఏడు రోజులపాటు నూతక్కి గ్రామం, కొల్లిపర, అత్తోట, దావులూరిపాలెంలలో విస్తృతంగా పర్యటించింది. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారులతో కలసి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, అనేక విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అత్తోట, నూతక్కి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వివిధ పంటలను, వారు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. ఈపర్యటనలో తమకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఏర్పడిందని బృంద సభ్యులు తెలిపారు. అనంతరం అత్తోట గ్రామంలో ఫైవ్-లేయర్ ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను సందర్శించి, వరి పంట బ్లాక్‌లో ద్రవ జీవామృతం ఉపయోగించిన విధానం, మార్కెటింగ్ విధానాలను, పీజీఎస్ సర్టిఫికెట్ గురించి తెలుసుకున్నారు. రైతుసాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ అధికారి లక్ష్మనాయక్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, స్టేట్ టీం వాణిశ్రీ,, అదనపు డీపీఎం సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ల డిమాండ్

మంగళగిరి టౌన్: దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను రద్దుచేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య, మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్లు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట కార్యాలయంలో మతోన్మాదం ఫాసిస్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతి శీల కార్మిక సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 19న రాష్ట్ర అసెంబ్లీలో ప్రపంచ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కును రద్దు చేస్తూ 13 గంటలు చేయాలని, అలాగే ఒక రోజు సమయంలో రోజున్నర పని చేయాలని తీర్మానించారని అన్నారు. ఆ తీర్మానంలో మహిళా కార్మికులకు కూడా నైట్ షిఫ్టులు పనిచేయాలని చేర్చారని, ఆ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన తరువాత ప్రజల వద్ద కారు చౌకగా భూములు గుంజుకుని పెట్టుబడి దారులకు అన్యాక్రాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆటో డ్రైవర్లుకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, స్త్రీశక్తి పథకం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయలు ఆటో యజమానికి కాకుండా డ్రైవర్లకు చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ప్రతి నెల ఆటో డ్రైవర్‌కు 5 వేల రూపాయలు పెన్షన్ చెల్లించాలని, ఆటో డ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, స్పేర్ పార్టుల ధరలను తగ్గించి ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్కె శ్రీను, యూనియన్ కోశాధికారి జాన్ సైదా పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణ గురవయ్య కాలనీకి చెందిన రమేష్ కుమార్‌కు, అదే కాలనీకి చెందిన గోపాల్, అన్వేషలకు వినాయక చవితి పండుగ సందర్భంలో ఘర్షణ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న గోపాల్, అన్వేష్ మరో ఇద్దరు స్నేహితులతో కలసి రమేష్‌కుమార్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితుడు చికిత్స తీసుకుంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించండి



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ తెనాలి నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కమిషనర్ జాగారపు రామ అప్పల నాయుడును మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నుంచి వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు చెప్పారు. మున్సిపల్ అధికారులు సహకరించాలని కోరారు. జేఏసీ నాయకులు శేషబాబు, ఆశాదీప్, వీరేంద్ర, ప్రశాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్కరకాలనీ బాధితులకు న్యాయం చేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పుష్కర కాలనీ బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం నాయకు లు డిమాండ్ చేశారు. బుధవారం పుష్కర కాలనీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా పాలక పార్టీలు పుష్కర కాలనీ వాసులకు ఇస్తామన్న రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇప్పటిదాకా ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతున్నామన్నారు. అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతూ అర్జీలు స్వీకరించామని, ఈనెల 17వ తేదీ ఎంటీఎంసీ కార్యాలయం వద్ద వాటిని అందజేయనున్నా మని తెలిపారు.

మంగళగిరి ఆర్టీసీ డ్రైవర్ల వేతనాల్లో వివక్ష

మంగళగిరి టౌన్: రాజధాని ప్రాంతమైన మంగళగిరి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్యూటీ డ్రైవర్స్ వేతనాలు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి డిపోలో వివక్ష నడుస్తోందని గుంటూరు జిల్లా పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్, జిల్లా కమిటీ సభ్యులు నాగుర్ వలి, మంజుశ్రీ, శ్రీదర్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆన్‌కాల్ డ్రైవర్లకు సింగిల్ డ్యూటీకి వెయ్యి రూపాయలు, డబుల్ డ్యూటీకి 2 వేల రూపాయలు ఇస్తుంటే మంగళగిరిలో మాత్రం డబుల్ డ్యూటీకి 1600 రూపాయలు మాత్రమే ఇస్తూ డ్రైవర్లను ఇబ్బంది పెట్టి బాధపెడుతున్నారన్నారు. మంగళగిరి డిపోలో సుమారుగా 20 మందికి పైగా ఆన్‌కాల్ డ్రైవర్లు ఉన్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్నిచోట్లా ఎలా ఇస్తున్నారో అలాగే మంగళగిరి డిపోలో కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు పథకం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచలేదని, దీంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఒక బస్సులో 100 మంది నుంచి 120 మంది దాకా ప్రయాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా ప్రజల పట్ల భద్రత వహించాలని, బస్సుల సంఖ్య పెంచాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

మున్సిపల్ కమిషనర్ జాగరపు రామ అప్పలనాయుడు


హౌసింగ్ అధికారులతో సమీక్ష జరుపుతున్న కమిషనర్

తెనాలిఅర్బన్: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ జాగరపు రామ అప్పలనాయుడు సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో సమీక్ష జరిపారు. తెనాలి పరిధిలో గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌లలో 10 మంది అందుబాటులో లేకపోవటం వల్ల నోటీసులు ఇవ్వటం జరిగిందని ఈఈ భాస్కర రావు తెలిపారు. మిగిలిన వారితో నిర్మాణాలు చేయిస్తున్నట్లు చెప్పారు. పూలే కాలనీలోని టిడ్కో భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. అలాగే మార్ట్‌గేజ్ చేయని వారిని గుర్తించి వారితో బ్యాంక్‌లలో చేయించాలన్నారు. వచ్చే ఏడాది వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ పి.శ్రీకాంత్, డీఈలు అకుల శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ సేతుబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను సక్రమంగా ఉండాలి..

తెనాలిఅర్బన్: రక్షిత మంచినీటి సరఫరాను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ జాగరపు రామఅప్పలనాయుడు ఆదేశించారు. వీఎస్ఆర్ కళాశాల రోడ్డులోని హెడ్ వాటర్ ట్యాంక్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. నీటి సరఫరాల తీరును పరిశీలించారు. అలాగే శాంపిల్ కలక్షన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమయానికి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. డీఈ శ్రీనివాసులు, ఏఈ జానీబాషా, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు తదితరులు ఉన్నారు.

చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం..

తెనాలిఅర్బన్: చెత్త రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పల నాయుడు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సెక్రటరీలతో బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. డోర్ టు డోర్ కలెక్షన్‌ను నూరుశాతం జరిగే విధంగా చూడాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 300 మందికి పరీక్షలు


మందులు అందజేస్తున్న కత్తెర సురేష్, హెనిక్రిస్టినా దంపతులు

తెనాలి: హార్వెస్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పటల్ సహకారంతో బుధవారం స్థానిక ప్యాడిసన్ పేట పొట్టిశ్రీరాములు కళ్యాణమండపంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సంస్థ అధినేత కత్తెర సురేష్, హెనీ క్రిస్టినా దంపతుల తనయుడు డాక్టర్ డేవిడ్‌యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటైన శిబిరాన్ని సురేష్, క్రిస్టినా దంపతులు ప్రారంభించారు. ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కాటూరి హాస్పటల్ వైద్యబృందం కంటిపరీక్షలు, గుండె, ఎముకలు, ప్రసూతి, మూత్రసంబంధిత పరీక్షలను చే శారు. అవసరమైన రోగులకు ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ, రక్తపరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు. సాయంత్రం వరకు జరిగిన వైద్యశిబిరంలో 300 మంది రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం డేవిడ్ యశ్వంత్ జన్మదిన వేడుకల్లో కెఎస్ఆర్ యూత్ భారీ కేక్ కట్‌చేశారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ సేవలు నిరుపేదలకు అండగా నిలుస్తాయని, విపత్తుల్లో సహాయానికి ముందువరుసలో నిలుస్తుందని శిబిరాన్ని పర్యవేక్షించిన సంస్థ మేనేజర్, 'మాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండమూడి బోస్, మాల మహానాడు అధ్యక్షుడు జ్యోతుల బాబి, పరంజ్యోతి, ఆనె రవీంద్ర, రావూరి సతీష్, గండి కోటి, ఆంజనేయులు, కోట్ల దిలీప్, రాజేష్, పులి, శౌరి, భాస్కర్, రవి, వర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పాలకులు పరిష్కరించాలి


దీక్షా శిబిరంలో కార్మికుల మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: అధికారంలో ఉన్న పాలకులు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే కార్మికుల సమస్య పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. సంపద సృష్టికి కార్మికుల శ్రమే మూలమని ప్రపంచం చెబుతుంటే, పెట్టుబడి దారులే కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సారమ్మ, రమాదేవి, రిబ్కా, ఏడుకొండలు, అంకమ్మ, సాంబశివరావు, సుబ్బారావు, సుభాని, నాగేశ్వరరావు, దుర్గాభవాని, రమణమ్మ, హగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత సయ్యద్ దౌలత్ హఠాన్మరణం


దౌలత్ భౌతికకాయం వద్ద శివకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ నాయకుడు సయ్యద్ దౌలత్ (49) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. స్థానిక మారీసుపేట మఠంబజారులో నివసిస్తున్న దౌలత్ కుటుంబంతో సహా చేబ్రోలు మండలంలోని అత్తగారి ఊరు వడ్లమూడి వెళ్లారు. అక్కడ ఉండగానే బుధవారం తెల్లవారుజామున గుండెపోటు సంభవించింది. హుటాహుటిన మంగళగిరిలోని కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో భౌతికకాయాన్ని తెనాలికి చేర్చారు. ఇక్కడి మార్కెట్ సెంటర్లో 'మహారాష్ట్ర ఆనియన్స్' పేరుతో ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపారం చేస్తుండే దౌలత్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు సన్నిహితంగా ఉంటూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దౌలత్ భౌతికకాయానికి సాయంత్రం అంతిమ సంస్కారాలను నిర్వహించారు. సమాచారం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దౌలత్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

వేలం ప్రకటన

E.P.No.34/2022 O.S.No.2/2021

Between:-

CHAVVAKULA SAMPATH KUMAR -D.H.R

And

PAMULA ANITHA DEVI -J.D.R

Schedule - This property belongs to the J.Dr is situated in Guntur Dist., Duggirala Sub-Registry, Tenali Mandal, Nandivelugu Village, in R.S.No. 204 in an extent of Ac.0.25 cents out of Ac.0.69 cents, in R.S.No. 205 in an extent of Ac.0.1 cents out of Ac.0.18 cents and in R.S.No. 205A, in an extent of Ac.0.10 cents of in all total extent of Ac.0.47 cents of land is situated within the following boundaries as follows: East: joint irrigation channel 80 links, South: Pamula Sunil Kumar property 101 1/2 links, West: Land belongs to Manga Srinivasa Rao and other irrigation channel 229 links, North Pamula Sunil Kumar property 38 links, East: Land belongs to Jonnalagadda Yedukondalu 19 links, East Pamula Sunil Kumar property 66 links, South Pamula Sunil Kumar property 123 links, North: land of Bejjam Chinna Abbai, with the above eight boundaries in an extent of 1452 sq.yards or 1214.5 sq.mts of vacant site in which undivided half share of the respondent with all easementary rights. the schedule property of and is value Rs. 30,00,000/-

D.H.R. Value Rs. 30,00,000/-

Amine Value Rs. 35,00,000/-

Sale Date : 23-10-2025

Further Hg: 30-10-2025

E.SRINIVASA BABU - M.RAVI KUMAR